క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

గుత్తి: మున్సిపాలిటీలోని జెడ్ వీరారెడ్డి కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం, డీవైఎఫ్‌ఐ నాయకులు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బార్‌మియాకి వినతి పత్రం అందజేశారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, రేణుక, డీవైఎఫ్‌ఐ నాయకులు అశోక్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌నాయక్ ఆశయ సాధనకు కృషి


రంజిత్‌నాయక్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి: సేవాలాల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సేవాలాల్ మందిర నిర్మాత రంజిత్ నాయక్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ పిలుపునిచ్చారు. రంజిత్ నాయక్ వర్ధంతి సందర్భంగా బుధవారం చెర్లోపల్లి సమీపంలోని సేవాగడ్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ రంజిత్ నాయక్ సేవాగడ్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. సీనియర్ గిరిజన నాయకులు మల్లికార్జున నాయక్, వెంకటేష్ నాయక్,బధ్యా నాయక్, రాముడు నాయక్, ఆది నాయక్, మనోహర్ నాయక్, గట్టునాయక్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి


మహిళలకు ధ్రువీకరణ పత్రాలు, కుట్టు మిషన్లు అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో నక్కనదొడ్డి పంచాయతీలోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చిన విషయం విదితమే. ఈక్రమంలో బుధవారం సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన ఐఓసీ సీనియర్ డిపో మేనేజర్ హరిష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 296 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లతోపాటు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై 'కూటమి' నిర్లక్ష్యం


విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న నాయకులు

గుత్తి: సంక్షేమ హాస్టళ్లు చాలా అధ్వానంగా తయారయ్యాయని, అయినా కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవడం లేదని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పట్టణాధ్యక్షుడు ఇమ్రాన్ విమర్శించారు. పట్టణంలోని ఎస్టీ వసతిగృహాలను బుధవారం వారు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచి చూశారు. వసతి గృహాల్లోన్ని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. ఎస్టీ హాస్టల్ వార్డెన్ చంద్రకళపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మాటలు తప్ప ఆచరణక దిగడం లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు కనీసం ప్లేట్లు, దుప్పట్లు కూడా పంపిణీ చేయలేదన్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు జగదీష్, రాహుల్ రెడ్డి, మణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

గణపయ్య.. పొట్ట నింపేనయ్య!

- విగ్రహాల తయారీతో పలువురికి ఉపాధి
- అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్న యువత
- రూ. 6 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు

తాడిపత్రి రూరల్: పట్టణంలో వినాయక విగ్రహాల తయారీ ఊపందుకుంది. నంద్యాల రోడ్డులోని పెన్నానది ఒడ్డున ఈ తంతు జరుగుతోంది. గుంతకల్లు నుంచి 15 ఏళ్ల క్రితం వలస వచ్చిన రామ్మోహన్ కుటుంబంతో పాటు బంధువులు విగ్రహాల తయారి ప్రారంభించారు. గతంలో గుంతకల్లులో విగ్రహాల తయారీ అనుభవాన్ని ఉపయోగించుకొని తమతో పాటు చుట్టు పక్కల వారికి ఏడాదిలో 5 నెలలు ఉపాధి కల్పిస్తున్నారు. ఇక్కడ ఏటా 150 నుంచి 200 విగ్రహాలను వివిధ రకాల సైజుల్లో తయారి చేస్తున్నారు. ఒక్కో విగ్రహం ఎత్తు 6 అడుగుల నుంచి 12 అడుగుల వరకు ఉంటున్నాయి.

అనంతపురం నుంచి ముడి సరుకు

విగ్రహాల తయారికి అవసరమైన ముడిసరుకు, రంగులను అనంతపురంలోని హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. విగ్రహాల తయారీ కోసం ప్రధానంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను ఉపయోగిస్తున్నారు. 30 కిలోల బస్తా రూ.300 ధర ఉంటోంది. విగ్రహాలను అచ్చులుగా వేసేందుకు ఐదు బస్తాలకు పైగా ఉపయోగిస్తున్నారు. వివిధ రకాల రంగులను కూడా అనంతపురం నుంచి కొనుగోలు చేస్తున్నారు.

విగ్రహాల కొనుగోలు కోసం ఆసక్తి

ఏటేటా తాడిపత్రి పట్టణంతోపాటు పరిసర మండలాల్లో వినాయక చవతి నవరాత్రుల్లో విగ్రహాలను ఏర్పాటు చేయడం అధికమవుతోంది. విగ్రహాల ఏర్పాటుకు యువత పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపుతోంది. విగ్రహాల తయారీ వద్దకు అధిక సంఖ్యలో యువకులు వచ్చి తయారైన విగ్రహాల్లో తమకు కావాల్సిన విగ్రహాలను ఎంపిక చేసుకుంటూ ముందుస్తు అడ్వాన్సులను ఇచ్చి వెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తయారీ కేంద్రం వద్ద యువకుల కోలాహలం ఉంటోంది.


విక్రయానికి సిద్ధమైన వినాయకుని విగ్రహాలు

కూలి గిట్టుబాటు అవుతోంది



15 ఏళ్ల క్రితం గుంతకల్లు నుంచి తాడిపత్రికి కుటుంబసభ్యులతో కలిసి వలస వచ్చా. ఏటా విగ్రహాల తయారీ ద్వారా కూలీ పాటుగా వస్తోంది. ఇతర పనులకు వెళ్లడం కంటే విగ్రహాల తయారు చేయడం ద్వారా నాతోపాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నా.
– రామ్మోహన్, విగ్రహాల యజమాని

విగ్రహాలకు రంగులు వేస్తుంటా



తయారు చేసిన వినాయకుని విగ్రహాలకు వివిధ రకాల రంగులను వేస్తుంటా. రోజుకు రూ.1000 కూలి వస్తోంది. చేతి నిండా పని ఉంటోంది. ఏడాదిలో 5 నెలలపాటు ఉపాధి గ్యారెంటీ. పండుగ వచ్చే సరికి పని ఎక్కువగా ఉంటోంది.
–వీరేష్, తాడిపత్రి

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు


కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్

గుత్తి: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. చైర్ పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రారంభంలోనే మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, కేవీ రమణ, వాల్మీకి శివ, నజీర్, ఖాజా ఖాన్ మాట్లాడుతూ పట్టణంలో నెలకోమారు కూడా తాగునీరు సరఫరా చేయడం లేదంటూ అధికారులపై మండిపడ్డారు. గుత్తి ఆర్ఎస్ ఎస్సీ కాలనీలో సామూహిక మరుగుదొడ్ల అధ్వానంగా ఉన్నాయన్నారు. కనీసం వాటికి నీటి సదుపాయం లేదని, డోర్లు కూడా లేవన్నారు. పట్టణంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోందన్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో సమస్యలు చెప్పడం మీరు మరిచి పోవడం పరిపాటిగా మారిపోయిందని అధికారులను నిలదీశారు. పట్టణంలో పది రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నామని డీఈ హేమచంద్ర చెప్పడంతో కౌన్సిలర్లు ఆయనపై మండిపడ్డారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. కమిషనర్ జబ్బార్‌మియా పాల్గొన్నారు.

పాతకొత్తచెరువులో హాస్టల్ భవనాన్ని నిర్మించాలి

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరిందని, దానిస్థానంలో వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. హాస్టల్ బాట కార్యక్రమంలో భాగంగా వారు బుధవారం పాతకొత్త చెరువు బీసీ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న పై కప్పు, తలుపులు లేని కిటికీలు, పాడై పోయిన ట్రంకు పెట్టెలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రాముతో కలిసి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీ యాదవ్ మాట్లాడారు. పాతకొత్తచెరువు హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాతకొత్తచెరువు హాస్టల్ భవనానికి రూ.52 లక్షల నిధులను మంజూరు చేశారని, కానీ అదే సమయానికి ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు జరగలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నూతన హాస్టల్ భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

'సూపర్ సిక్స్' అమలులో అట్టర్‌ఫ్లాప్


గార్లదిన్నెలో కార్యక్రమం నిర్వహిస్తున్న సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్, నాయకులు

- శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమల్లో అట్టర్‌ఫ్లాప్ అయిందని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గార్లదిన్నెలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో 143 హామీలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని మాట చెప్పారు. అధికారంలో వచ్చిన తర్వాత పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసగించారన్నారు. అన్నదదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాల ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చి హామీల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికీ దాదాపు రూ.1.90 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పథకాల ద్వారా రావాల్సిన ఉందన్నారు. చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు ఊరురా మద్యం పూర్తి స్థాయిలో అమలు చేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన ఫొటోలకే పరిమితమన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నిస్తుంటే కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. పథకాలు అమలుపై ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త గ్రామాల్లో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరైనా పథకాలు అమలు కాలేదంటే చంద్రబాబు వారి నాలుక మందం అని అనడం విడ్డూరమని, కానీ ప్రభుత్వానికే చర్మం మందమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, శింగనమల మండల కన్వీనర్ ప్రసాద్, బుక్కరాయ సముద్రం జెడ్పీటీసీ భాస్కర్, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు అనిల్‌రెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు నాగరాజు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం


నరసాపురంలోప్రజలతో మాట్లాడుతున్న నార్పల సత్యనారాయణరెడ్డి


తాడిపత్రిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

యాడికి: ఎన్నికల్లో అబద్ధపు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసగించడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, వేములపాడు, చిక్కేపల్లి సర్పంచులు ఓంకారమ్మ, నాగలక్షుమ్మ అన్నారు. బుధవారం వారు వేములపాడు, చిక్కేపల్లిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తెలుపుతూ బాబు మోసాలను వివరించారు. అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టారని, వ్యవసాయ పనులు జరుగుతున్నా యూరియా అందివ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. మేనిఫెస్టో అమలు చేయని చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు పిలుపు నిచ్చారు. చిక్కేపల్లిలో నాయకులు అశోక్ రెడ్డి, నారాయణ రెడ్డి, దేవనాథరెడ్డి, నరేష్ కిట్టు, వేములపాడు గ్రామంలో నగరూరు సర్పంచు రుక్మాంద రెడ్డి, రసూల్, సాంబశివుడు, శామీర్, మల్లికార్జున, యుగేంద్ర, రజక వీరాంజనేయులు, లాలు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నీలాంపల్లి, కొత్త చెదుల్ల, పాత చెదుల్ల గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపుతున్నారన్నారు. ఏడాదైనా సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మసూద్, ఎంపీటీసీ అంజిన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర రెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, కాటమయ్య, అంజి, ఆది, బయపరెడ్డి, రంగా, లక్ష్మీనారాయణ, వరికూటి కాటమయ్య, నిమ్మల భాస్కర్, నగేష్, రవి, సుజాత, సత్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'

పుట్లూరు: మండలంలోని చింతకుంట, కందికాపుల, నాయకునిపల్లి గ్రామాల్లో బుధవారం 'రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతో పాటు అనేక పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, నాయకులు కందికాపుల శ్రీధర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సూరి, బాలసుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, రమణారెడ్డి, రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

నార్పల: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(అనంతపురం పార్లమెంట్) నార్పల సత్యనారాయణరెడ్డి విమర్శించారు. బుధవారం దుగుమర్రి, నీలితోటిపల్లి, నరసాపురం, రంగాపురం, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, నాయకులు బయపరెడ్డి, రాజారెడ్డి, శేఖర్ రెడ్డి, చౌరెడ్డి, పోలయ్య, ఎలపనాయుడు, రామయ్య, వెంకనారాయణరెడ్డి, పక్కీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కి తర్వాత ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. బుధవారం తాడిపత్రి 13వ వార్డులో నాయకులు హరినాథరెడ్డి, జూటూరు బాల్‌రెడ్డి, నరసింహారెడ్డి , పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లిలో దేవన నారాయణరెడ్డి, సూరప్ప ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు చేసిన మోసాన్ని వివరించారు. నాయకులు బాబు, ప్రసాద్ రవి మల్లికార్జున, పెద్దవడుగూరు మండల నేతలు వడ్డే పుల్లయ్య, వీరబాలయాదవ్, హరినాథ్ రెడ్డి , గోవర్ధన్‌రెడ్డి, తిమ్మప్ప, దేవన గోవర్ధన్‌రెడ్డి, గోవింద్, గంగన్న, క్రిష్ణమూర్తి, పుల్లన్న, రాజు, చాకలి నాగరాజు, శేషారెడ్డి, నారాయణస్వామి, నాగేంద్రరెడ్డి, శివారెడ్డి,నారాయణప్ప పాల్గొన్నారు.


యాడికి మండలం వేములపాడులో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


బీకేఎస్ మండలం చెదుల్లలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి


పుట్లూరు మండలం కందికాపులలో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఇస్కాన్ మందిరంలో చిన్నారులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కలరింగ్, సృజన విభాగాల్లో చిన్నారులు శ్రీకృష్ణ లీలా విశేషాలకు అద్భుత రూపునిచ్చి ఆకట్టుకున్నారు. నిర్వాహకులు ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు మాట్లాడుతూ.. ఈనెల 15 , 16 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు చిత్రలేఖన పోటీలు జరిగాయని, గురువారం వ్యాసరచన పోటీలు, శుక్రవారం క్విజ్, సంప్రదాయ వేషధారణల పోటీలు జరుగుతాయన్నారు. పోటీల సమన్వయకర్తలు రమ్యమాతాజీ, సుధీర్ వర్మ మాట్లాడుతూ.. ఆగష్టు 15న విజేతలుగా నిలిచిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, 16న ఉన్నత విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

శనగలగూడూరులో 'పొలం పిలుస్తోంది'

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ కాత్యాయ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అన్నదాత సుఖీభవ, సీహెచ్‌సీ డ్రోన్, కౌలు రైతు గుర్తింపు కార్డులపై వివరించారు. కార్యక్రమంలో ఆత్మా బీటీఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏటీఎం హిమబిందు, గౌతం, వీఏఏ రాజ్యలక్ష్మి, ఎంపీఈఓ నాగలింగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

యాడికి: గుడిపాడు, నిట్టూరు గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. బుధవారం గుడిపాడులో దేవనకొండ శివ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అతడిని పట్టుకుని 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిట్టూరు గ్రామంలో లక్ష్మన్న నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

పుట్లూరు: మండలంలో రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సూరి మాట్లాడుతూ శింగనమల తహసీల్దార్ శేషారెడ్డికి పుట్లూరు బాధ్యతలు అదనంగా అప్పగించడంతో ప్రజలు పనులు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జోనల్ కోశాధికారిగా సాయిబాబా



గుంతకల్లు: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ కోశాధికారిగా గుంతకల్లుకు చెందిన ఎస్.సాయిబాబా ఎన్నికయ్యారు. బుధవారం సికింద్రాబాద్‌లో జోనల్ స్థాయి అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఇందులో గుంతకల్లు, హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు డివిజన్ కేంద్రాలతోపాటు జోనల్ కేంద్రంలోని రైల్ నిలయం, తిరుపతి, రాయంపాడు, లాలాగూడ వర్క్‌షాపులకు చెందిన దాదాపు 54 మంది డెలిగేట్స్ పాల్గొన్నారు. ఎలిఫెంట్ (ఏనుగు), ధర్మచక్ర ప్యానల్ గుర్తులతో ఎన్నికలు జరిగాయి. ఇందులో ఎలిఫెంట్ ప్యానల్ క్లీన్ స్వీప్ చేసింది. జోనల్ అధ్యక్షుడిగా వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మానాయక్, కోశాధికారిగా ఎస్.సాయిబాబా (గుంతకల్లు), సెక్రటరీగా దాశరథీకృష్ణ, అడిషనల్ సెక్రటరీగా కేవీ హరిప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం సాయిబాబా గుంతకల్లు డివిజన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

వసతిగృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలి

శింగనమల: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు కోరారు. బుధవారం వారు శింగనమలలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర హాస్టళ్లను తనిఖీ చేశారు. ఎస్సీ బాలుర హాస్టళ్లలో నీటి వసతి సరిగ్గా లేదన్నారు. విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మహేష్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కార్యదర్శులు జెల్లీ, చంద్రమౌళి యాదవ్, గౌతమ్ సాయిరెడ్డి, మని, సాయినాథ్ రెడ్డి, హరీష్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు

గార్లదిన్నె: కల్లూరు అగ్రహారంలో భూసమస్యపై ఇరు వర్గాల ఘర్షణలో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పామిడి మండలానికి చెందిన ఘశాంత్ అనే వ్యక్తికి గార్లదిన్నె మండలం కల్లూరు అగ్రహారంలో 5 ఎకరాల భూమి ఉంది. 2023లో ఘశాంత్ తన 2 ఎకరాల భూమిని రమణ అనే వ్యక్తికి విక్రయించాడు. భూమి కొనుగోలుకు సంబంధించి రూ.5 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమయంలో భూమి కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రైతుపై ఒత్తిడి తేవడంతో ఇరువర్గాలు ఈనెల 27న ఘర్షణ పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ల సీజ్

గార్లదిన్నె: శింగనమల మండలం తరిమెల పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లు పట్టుకున్నారు. తరిమెల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి శింగనమల తహసీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌ఐ కేశవనాయుడు పెన్నానదిలో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసి వాహనాలను గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కల్యాణ వైభోగమే..


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు ఘనంగా కల్యాణం జరిపించారు. శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాలతో పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.